సాక్షి
సిద్దిపేట
సోమవారం। 20 ఫిబ్రవరి। 2023



'రింగు' రోడ్డుకు కొత్త హంగులు
గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ 'రింగు' రోడ్డు కొత్త హంగులను అద్దుకుంది. ఏడు కిలోమీటర్ల నేషనల్ హైవే తరహాలో ఆరులేన్లుగా విస్తరించారు. 8లో..



కూలిన దేవస్థానం ముఖద్వారం
నాచారం దేవస్థానం ముఖద్వారం నిర్మాణం ప్రమాదవశాత్తు కూలింది. ఈ ఘటనలో ఐదుగురు భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. 8లో..



గిరిజనుల సంక్షేమానికి కృషి
గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్ కుమార్ అన్నారు. సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో ఆయన మాట్లాడారు. 9లో..

న్యూస్‌రీల్

పాండురంగ ఆశ్రమంలో పూజలు



పూజలు చేస్తున్న నాయకులు

మర్కూక్(గజ్వేల్): పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి గెలుపు తథ్యమని సంఘం జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ అన్నారు. ఈ నెల 23న నామినేషన్ వేస్తున్న సందర్భంగా ఆదివారం మండలంలోని శ్రీ పాండురంగ ఆశ్రమంలో శాసన మండలి సభ్యుడు కూర రఘోత్తంరెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శ్రీపాల్‌రెడ్డి, కమలాకర్ రావుతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట రాజం, మండలాల అధ్యక్షులు వెంకట్రామి రెడ్డి, రామకృష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి, కుమార్ శేఖర్, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అష్టకాల మరణం ఆధ్యాత్మిక రంగానికి తీరని లోటు

బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ



మాట్లాడుతున్న రాధాకృష్ణశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రముఖ పండితులు, అష్టావధాని అష్టకాల నరసింహరామశర్మ మృతి ఆధ్యాత్మిక, అవధాన రంగానికి తీరని లోటని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అనంతసాగర్ సరస్వతీ క్షేత్రం వద్ద అష్టకాల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైదికాన్ని అవపోసన పట్టి వేలాది మంది శిష్యులను తయారు చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. వివిధ ప్రాంతాల్లో 500పైగా సరస్వతీ యజ్ఞ యాగాలు నిర్వహించి అమ్మవారి మహత్యాన్ని సమాజానికి చాటిచెప్పారన్నారు. అష్టకాల మరణం ఆధ్యాత్మిక, ధార్మిక రంగాలకు, అవధానానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని కవులు, పండితులు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): మిగులు ఆదాయం ఉన్న రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన సీఎం కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. మద్దూరు మండలంలోని నర్సపల్లి గ్రామంలో ప్రజాగోస బీజేపా భరోసా కార్నర్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు మూడెకరాల భూ పంపిణీతో పాటు డబుల్ బెడ్ రూం ఇళ్లు, రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతి ఇతర హామీల్లో కేసీఆర్ ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండకట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆ దిశగా కార్యకర్తలు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బూర్గు సురేశ్‌గౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొంగని సురేశ్‌గౌడ్, మనోజ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

సిద్దిపేట ఎడ్యుకేషన్: డాక్టర్. బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం 2022–23 సంవత్సర డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షలు సోమవారం నుంచి జరగనునట్లు రీజినల్ కో ఆర్డినేటర్ డాక్టర్ భవాని ఒక ప్రకటన లో పేర్కొన్నారు. మీసేవ కేంద్రాల్లో హాల్ టికెట్ పొందాలని సూచించారు. ఈనెల 20 నుంచి 27 వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.



విద్యుత్ దీపాలంకరణలో కొమురవెల్లి మల్లన్న ఆలయం.. భక్తుల సందడి



ఉత్సవ విగ్రహాలతో పట్నం తొక్కుతున్న అర్చకులు

భక్తజన సంద్రం.. మల్లన్న క్షేత్రం

అంగరంగ వైభవంగా పెద్దపట్నం
- పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు
- శివనామ స్మరణతో మారుమోగిన తోటబావి ప్రాంగణం



బోనాలతో శివసత్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ అధికారులు, ఒగ్గుపూజారులు పెద్దపట్నం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తోటబావి వద్ద శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజామున వరకు పెద్దపట్నం వేడుకలను నిర్వహించారు. అదే సమయంలో గర్భగుడిలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈఓ బాలాజీ, ఆలయ చైర్మన్ గీస భిక్షపతి స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీలో ఊరేగించి తోట బావి ప్రాంగణానికి చేర్చారు. ఈ వేడుకలను చూసేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

150 మంది.. 41 వరుసలతో..

బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన పెద్ద పట్నంను తోట బావి ప్రాంగణంలో సుమారు 150 మంది ఒగ్గు పూజారులు 41 వరుసలతో వేశారు. దీనికోసం క్వింటాళ్ల కొద్ది పసుపు (బండారి)తో పాటు కుంకుమ, తెల్లపిండి, సునేరు, పచ్చలను ఉపయోగించారు. ఒగ్గు పూజారుల బృందం మొదట ఊరేగింపుతో వెళ్లి కోనేరులో తెప్పస్నానం చేసి పుట్టమట్టికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రత్యేక పల్లకీలో ఊరేగింపు నిర్వహించి ఆలయ తోటబావి వద్ద పెద్ద పట్నం వేసే ప్రాంతానికి చేర్చారు. అనంతరం పెద్ద పట్నం కార్యక్రమం ప్రారంభించారు.

విడతల వారీగా భక్తులు..

లింగోద్భవ కాలం శనివారం అర్ధరాత్రి 1:10 నిమిషాలకు బియ్యం సుంకించి మైల పోలుతో పెద్ద పట్నాన్ని ప్రారంభించి తెల్లవారుజాము 4 గంటల వరకు పట్నం వేశారు. ఒగ్గు పూజారులు ఊరేగింపుగా పోతరాజుల వేషధారణలో మంగళహారతులతో వెళ్లి మల్లన్న బోనాలు తీసుకువచ్చి పట్నంపై పెట్టి స్వామికి నైవేద్యం సమర్పించారు. పెద్ద పట్నం మధ్యలో నిమ్మకాయను పెట్టి చిత్రకను నెలకొల్పి పట్నానికి నాలుగు వైపుల గుమ్మడికాయలు, కొబ్బరికాయలను పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామి వారి గర్భగుడి నుంచి ఉత్సవ విగ్రహాలను తీసుకువచ్చి స్వామి వారికి యాదవ సాంప్రదాయం ప్రకారం కల్యాణం నిర్వహించారు. ఆ వెంటనే ఆలయ అర్చకులు ఉత్సవ విగ్రహాలతో పట్నం తొక్కారు. అనంతరం భక్తులు సైతం విడతల వారీగా పట్నాన్ని దాటారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావడంతో ఆలయపరిసరాలు శివనామస్మరణతో మారుమోగాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ చైర్మన్ భిక్షపతి, ఈవో బాలాజీ, ఏఈఓ అంజయ్య పర్యవేక్షించారు. సిద్దిపేట అడిషనల్ డీసీపీ మహేందర్, హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.



పెద్ద పట్నం వద్ద భక్తుల కోలాహలం

బారికేడ్లపై నుంచి దూకిన భక్తులు

పెద్దపట్నం పూర్తయిన వెంటనే పట్నంను దాటేందకు గ్యాలరీలోని భక్తులు బారికేడ్లపై నుంచి దూకే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు స్వల్పంగా లాఠీచార్జ్ చేసి నియంత్రించారు. స్వామి వారికి ఆదివారం తెల్లవారుజామున పెద్ద పట్నం ముగిసిన వెంటనే గర్భగుడిలో మహా అన్నపూజ, ఏకదశ రుద్రాభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ అర్చకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కేదార్‌నాథ్ ఆలయ ప్రధాన పూజారిగా ఖేడ్ వాసి

పదేళ్లుగా ఆలయంలో సేవలు



శివ్‌లింగ్ స్వామి

నారాయణఖేడ్: ఉత్తరాఖండ్‌లోని ప్రముఖ జ్యోతిర్లింగం కేదార్‌నాథ్ ఆలయ ప్రధాన పూజారిగా సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం చాప్టా(కె) గ్రామానికి చెందిన శివ్ లింగ్ స్వామి నియామకమయ్యారు. ఆయన పదేళ్లుగా కేదార్‌నాథ్ ఆలయంలో ఆయన గురువు 108 రావుల్ సద్గురు విభూషిత్ జగద్గురు భీమాశంకర్‌లింగ్ శివాచార్య మహాస్వామి ఆధ్వర్యంలో పూజారిగా పని చేస్తున్నారు. ఈ ఆలయంలో ప్రతీ సంవత్సరం దక్షిణ భారతదేశం నుంచి ఐదుగురికి ప్రధాన పూజార్లుగా అవకాశం కల్పిస్తారు. ఇందులో భాగంగా ఈసారి నారాయణఖేడ్ పరిధిలోని చాప్టా(కె)కు చెందిన శివ్‌లింగ్‌స్వామికి అవకాశం దక్కింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేదార్‌నాథ్ ఆలయంలో ఈ ఏడాది ఏప్రిల్ 26 ఉదయం 6.20 నిమిషాల నుంచి భక్తులకు దర్శనం ప్రారంభం అవుతుందన్నారు. ఏప్రిల్ 20 నుంచి విశేష పూజలు ఉంటాయన్నారు. 21న ఉఖీమఠంలో పూజలు చేసిన అనంతరం అక్కడి నుంచి శోభయాత్ర ప్రారంభం అవుతుందని తెలిపారు. అనంతరం 22న డోలిపాట్, 24న భీంబలి, లీనాచోలిల మీదుగా కేదారినాథ్‌కు దిండి శోభయాత్ర కొనసాగుతుందన్నారు. 26 నుంచి దీపావళి పాడ్యమి వరకు కేదార్‌నాథ్‌లోని జ్యోతిర్లింగ దర్శనం భక్తులకు ఉంటుందని వివరించారు.

పోటాపోటీగా శివాజీ జయంతోత్సవాలు



బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ..

హిందూ వాహిని, బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హిందూ వాహిని, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలు ఆదివారం సిద్దిపేట పట్టణంలో పోటాపోటీగా నిర్వహించారు. ఇరు వర్గాలు భారీగా బైక్ ర్యాలీలు చేపట్టారు. దీంతో పట్టణం కాషాయమయం.. గులాబీమయంగా మారింది. బీఆర్‌ఎస్ యువజన విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శివాజీ స్ఫూర్తి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో బీఆర్‌ఎస్ యువజన విభాగం, విద్యార్థి విభాగం, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం వీర శివాజీ చౌరస్తా వద్ద శివాజీ విగ్రహానికి పూలమాలలు, పాలభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ మాట్లాడారు. కాషాయం కొందరి సొత్తు కాదని, అందరిదన్నారు. కార్యక్రమంలో మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, పాలసాయిరాం, రవీందర్‌రెడ్డి, కూర మాణిక్‌రెడ్డి, జాప శ్రీకాంత్‌రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, వంగనాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శివాజీ చౌరస్తా వరకు..

హిందూ వాహిని ఆధ్వర్యంలోనూ శివాజీ జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. రేణుకా ఎల్లమ్మ ఆలయం నుంచి శివాజీ చౌరస్తా వరకు బైక్ ర్యాలీని నిర్వహించి విగ్రహానికి పూలమాలలు వేసి పాలాభిషేకం నిర్వహించారు. అలాగే బైక్ ర్యాలీలో హిందూ వాహిని, బజరంగ్ దళ్, విశ్వహిందు పరిషత్, బీజేపీ నాయకులు, పాల్గొన్నారు. కార్యక్రమంలో శివకుమార్, సత్యం, శివాజీగణేశ్, ప్రదీప్, ప్రశాంత్, రాజు, అజయ్, కొత్తపల్లి వేణుగోపాల్, విద్యాసాగర్, అరుణరెడ్డి, పద్మ పాల్గొన్నారు. అలాగే తెలంగాణ ఉపాధ్యాయ సంఘం, జాతీయ సాహిత్య పరిషత్‌ల ఆధ్వర్యంలోనూ నివాళులర్పించారు.



హిందూ వాహిని ఆధ్వర్యంలో..

అక్రమ అరెస్ట్‌లు సరికాదు

గజ్వేల్‌రూరల్: హైదరాబాద్‌లోని అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్‌లో మనుస్మృతి–రాజ్యాంగంపై జరిగిన సమినార్‌లో పాల్గొని వస్తున్న స్వేచ్ఛ జేఏసీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని, వెంటనే వారిని విడుదల చేయాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండ స్వామి, నాయకులు వేణులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ కేంద్రంలో పాలన సాగిస్తున్న ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, బలహీన వర్గాలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయన్నారు. బలహీన వర్గాలకు అండగా ఉన్న రాజ్యాంగాన్ని మార్చాలనే ప్రయత్నాన్ని ముమ్మరం చేస్తున్నారని, ప్రజాస్వామ్య వాదులంతా ఏకతాటిపై వచ్చి రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పోలీసులు అరెస్టు చేసిన డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, రాష్ట్ర మహిళ కార్యదర్శి కల్పతో పాటు స్వేచ్ఛ జేఏసీ నాయకులను వెంటనే విడుదల చేయాలన్నారు. లేనిపక్షంల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడుతామన్నారు.

దుబ్బాకరూరల్: పోలీస్‌లు డీబీఎఫ్ నేతలను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని డీబీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బీమ్‌శేఖర్ సైతం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కరాటేతో ఆత్మరక్షణ

హుస్నాబాద్: కరాటేతో శారీరక వ్యాయమం, మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని సీవీ రామన్ పాఠశాలలో షోటోకాన్ కరాటే పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ గోవిందు రవి, పాఠశాల కరస్పాండెంట్ కాయిత నారాయణ రెడ్డి, శిక్షకులు బొల్లి అయిలయ్య, శ్రీనాథ్, రమేష్, రవితేజ తదితరులు ఉన్నారు.



విజేతలతో మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత

ఏఐఎఫ్‌బీ జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

హుస్నాబాద్: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన్ భవన్‌లో ఈ నెల 21 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించే ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ(ఏఐఎఫ్‌బీ) జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గవ్వ వంశీధర్ రెడ్డి పిలుపునిచ్చాడు. ఆదివారం హుస్నాబాద్ పట్టణంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన పార్టీ 83 సంవత్సరాల తర్వాత జాతీయ మహాసభలను హైదరాబాద్‌లో జరుపుకోవడం సంతోషకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై చర్చించి రానున్న రోజుల్లో ప్రజల్లోకి ఏ విధంగా వెళ్లాలనే అంశాలపై తీర్మానం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, నాయకులు రాగుల శ్రీనివాస్, ప్రకాశ్, శంకరాచారి, తిరుపతి, రాజేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

బండ్ల జోరు.. బోనాల హోరు

- కనుల పండువగా బండ్ల ఊరేగింపు
- ఏడుపాయలకు పోటెత్తిన భక్తజనం

పాపన్నపేట(మెదక్): భక్తులతో వనం జనసంద్రమైంది. డప్పుల దరువులతో ఏడుపాయల కొండకోనలు దద్దరిల్లాయి. దుర్గమ్మ నామస్మరణతో మంజీరా తీరం మారుమోగింది. జోడెడ్ల బండ్ల జోరు.. బోనాలతో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మరికొంతమంది ఒడిబియ్యం, తలనీలాలు సమర్పించారు. జాతర రెండోరోజు ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం సుమారు ఐదు లక్షల మంది భక్తులు మంజీరానదిలో స్నానాలు చేసి దుర్గమ్మతల్లిని దర్శించుకున్నారు.

బండెనక బండి కట్టి..

జాతరలో అత్యంత ప్రధాన ఘట్టమైన బండ్ల ఊరేగింపు ఆదివారం కనుల పండువగా సాగింది. పట్టుచీరలు, రవికలు, వేపకొమ్మలు, కొబ్బరిమట్టలు, దేవతామూర్తుల చిత్రపటాలు, గుమ్మటాలు, రంగులతో బండ్లను అందంగా తీర్చిదిద్దారు. శివసత్తులు సిగాలు ఊగుతుండగా, యువకులు నృత్యాలతో ఊరేగింపు ప్రారంభమైంది. మొదట పాపన్నపేట సంస్థానాధీశుల బండికి పాలకవర్గ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ శ్రీనివాస్ ఆచారం ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం నిర్దేశించిన వరుస క్రమంలో వివిధ గ్రామాలకు చెందిన సుమారు 60 బండ్లు అమ్మవారి ఆలయం చుట్టూ తిరిగాయి. అలాగే బోనాల ఊరేగింపు భక్తులను ఆకట్టుకుంది. బాలప్ప కుటుంబీకులు చేసిన అతిపెద్ద బోనం, పోతరాజుల గావు కేకలు, యువకుల నృత్యాలు జాతరలో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు చర్యలు చేపట్టారు.



జనసంద్రంగా బండ్ల ఊరేగింపు

వనమంతా జనమే..

ఎల్లలు దాటి తరలివచ్చిన లక్షలాది భక్తులతో ఏడుపాయల జనారణ్యంగా మారింది. గుట్ట గుట్టకు, చెట్టు చెట్టుకు ఎటు చూసినా జనమే కనిపించారు. కొల్చారం వైపు నుంచి భారీగా భక్తులు తరలిరావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. చెక్ పోస్టు వద్ద వాహనాలు భారీగా నిలిచిపోయాయి. జాతరలోకి వాహనాలను వదలకపోవడంతో ఉచిత బస్సుల్లో ప్రయాణికులు చేరుకున్నారు. వృద్ధులు, పిల్లలు కొంత ఇబ్బందులకు గురయ్యారు.



ఆలయం ఎదుట భక్తుల సందడి

క్లుప్తంగా

పావురాన్ని కాపాడిన అగ్నిమాపక ఉద్యోగి


పావురాన్ని కాపాడిన శ్రీనివాస్

పటాన్‌చెరుటౌన్: మాంజా దారంలో చిక్కుకున్న పావురాన్ని అగ్నిమాపక ఉద్యోగి కాపాడాడు. పటాన్‌చెరు డివిజన్ పరిధి టోల్‌గేట్ సమీప డివైడర్‌పై ఏర్పాటు చేసిన బట్టర్ ఫ్లయ్ లైటింగ్ పోల్‌కు మాంజా(దారం) చుట్టుకుంది. ఆ దారానికి ఓ పావురం చిక్కుకుని విలవిలలాడుతుండటం ఆదివారం అటుగా వెళ్తున్న పటాన్‌చెరు ఫైర్‌స్టేషన్ ఉద్యోగి శ్రీనివాస్ చూశాడు. వెంటనే క్రేన్ సాయంతో పోల్ ఎక్కి దారంలో చిక్కుకున్న పావురాన్ని రక్షించాడు. శ్రీనివాస్‌ను స్థానికులు అభినందించి అతడితో సెల్ఫీ దిగారు.

మూర్చతో గజ ఈతగాడు మృతి


సాయిలు మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల జాతరలో గజ ఈతగాడు నీటి మునిగి చనిపోయాడు. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. పాపన్నపేట గ్రామానికి చెందిన గుమ్మడి సాయిలు (40) మంజీరా నదిలో ప్రమాదవశాత్తు నీట మునిగిన భక్తులను కాపాడేందుకు ఏడుపాయలకు వచ్చాడు. మంజీరా నదిలో పహారా కాస్తుండగా మూర్చరావడంతో నీటిలో పడి మృతి చెందినట్లు ఎస్‌ఐ విజయ్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నీట మునిగి యువకుడు..


రవి మృతదేహం

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల జాతరకు వచ్చిన ఓ యువకుడు మంజీరా నదిలో మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం జరిగింది. పాపన్నపేట ఎస్‌ఐ విజయ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పాపన్నపేట మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన రవి(32) ఏడుపాయల జాతరలోని టీపాయింట్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం బంధువులతో కలిసి చెక్‌డ్యాం వద్ద స్నానం చేసేందుకు వెళ్లాడు. ఈక్రమంలో స్నానం చేస్తూ మంజీరాలో మునిగిపోయాడు. బంధువులు, గజఈతగాళ్లు కలిసి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడికి భార్య మాధవి, ఒక కూతురు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసుకొని పాపన్నపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో..


అక్షయ్ రాథోడ్ మృతదేహం

జహీరాబాద్: జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్ కాలనీలో అనుమానాస్పద స్థితిలో మరణించిన యువకుడి మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. ఆదివారం రాత్రి అక్షయ్ రాథోడ్(24) తాను నివాసం ఉంటున్న అద్దె ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మరణించినట్లు బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జహీరాబాద్ మండలంలోని హోతి(కె) తండాకు చెందిన అక్షయ్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్ల క్రితం వివాహం కాగా, ఒక కుమారుడు ఉన్నట్లు, గత ఆరు నెలలుగా భార్య పట్టింట్లో ఉంటున్నట్లు బంధువులు తెలిపారు. అక్షయ్‌ను ఎవరో హత్య చేసి ఉంటారని, ఒంటిపై గాయాలు ఉన్నట్లు వారు ఆరోపించారు. ఈ మేరకు జహీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

'రింగు' రోడ్డుకు కొత్త హంగులు

- ఏడుకిలోమీటర్ల మేర... నేషనల్ హైవే తరహాలో నిర్మాణం
- జంక్షన్‌లతో నయా లుక్
- భవిష్యత్ అవసరాల దృష్ట్యా నిర్ణయం
- రూ.230 కోట్ల వ్యయంతో 22 కిలోమీటర్ల మేర నిర్మాణం
- త్వరలోనే అందుబాటులోకి తేవడానికి కార్యాచరణ

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ 'రింగు' రోడ్డు కొత్త హంగులను అద్దుకున్నది. ఏడు కిలోమీటర్ల నేషనల్ హైవే తరహాలో ఆరులేన్లుగా విస్తరించారు. భష్యత్తు అవసరాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రాంతంలో వ్యాపార, వాణిజ్య రంగాల అభివృద్ధికి మైలురాయిగా మారనున్న ఈ రోడ్డు నిర్మాణానికి రూ.230కోట్లు వెచ్చిస్తున్నారు. మొత్తంగా22కిలోమీటర్ల నిర్మిస్తున్న ఈ రోడ్డులో 15కిలోమీటర్లు నాలుగులేన్లుగా, మిగితావి ఆరులేన్లుగా విస్తరిస్తున్నారు. త్వరలోనే ఈ రోడ్డును అందుబాటులోకి తేవడానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై కథనం.

వివిధ కారణాలతో అర్ధాంతరంగా నిలిచిపోయిన రింగు రోడ్డును పనులను సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు అధికార యంతాంగం పనులను పునః ప్రారంభించింది. ఏడాది కాలంగా యుద్ధ ప్రాతిపదికన పనులుచేస్తున్నారు. గతంలో రూ.220 కోట్లతో పనులు జరగాయి. అందులో సగానికి పైగా వెచ్చించారు. అయితే పాత పనులను పూర్తిగా రద్దు చేసి రూ.118 కోట్లతో కొత్తగా రీ–టెండర్ పూర్తి చేసి తిరిగి ప్రారంభించారు. ఇందులో ప్రధానంగా రిమ్మనగూడ వద్ద, జగదేవ్‌పూర్ రోడ్డు వైపున బ్రిడ్జిలను అప్రోచ్ రోడ్లతో పూర్తి చేయడానికి నిర్ణయించారు. అంతేకాకుండా 22 కిలోమీటర్ల పూర్తయిన రోడ్డుపై మరో లేయర్ బీటీ వేశారు. అంతేకాకుండా రింగు రోడ్డుపై బయ్యారం, క్యాసారం గ్రామాలకు వెళ్లే మార్గాల వద్ద నిర్మించనున్న అండర్ పాస్‌లు, క్యాసారం వాగు వద్ద, బరిచెరువు వద్ద నిర్మించనున్న బ్రిడ్జిలకు అధికారులు స్వల్ప మార్పులు, చేర్పులు చేసి పనులు చేపట్టారు.

ప్రజ్ఞాపూర్–రిమ్మనగూడ వరకు 'జాతీయ' హంగులు

ప్రజ్ఞాపూర్ వద్ద 'రింగు' రోడ్డును తాకే రాజీవ్ రహదారి భవిష్యత్‌లో జాతీయ హోదాను పొందనున్న నేపథ్యంలో సుమారు 7 కిమీ పొడవునా 'రింగ్'రోడ్డు రాజీవ్ రహదారిలో అంతర్భాగం కాబోతున్నది కుడివైపున ఉండే 'రింగ్' రోడ్డు 7 కిమీ పొడవు అంటే ప్రజ్ఞాపూర్‌లోని (పాతూర్ జంక్షన్ నుంచి) జగదేవ్‌పూర్‌రోడ్డు, రిమ్మనగూడ గ్రామాల మీదుగా వెళ్లే రోడ్డు రాజీవ్ రహదారిలో కలవనున్నది. ఈ నేపథ్యంలోనే ఈ 7 కిమీ పొడవును భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే 6 లేన్లుగా విస్తరించారు. ఈ లెక్కన 'రింగ్'రోడ్డు ఆ 7 కిలోమీటర్ల పరిధిలో 150 అడుగుల వెడల్పుతో నిర్మాణం చేపట్టారు. మిగిలిన 15 కిలోమీటర్ల 100 మేర నిర్మాణం జరిగింది. మొత్తానికి గజ్వేల్ రింగు రోడ్డు అదనపు హంగులతో అలరారుతున్నది. ప్రజ్ఞాపూర్ నుంచి రిమ్మనగూడ వద్ద వాహనాలు ఎక్కి, దిగే చోట నిర్మించిన జంక్షన్ కొత్త రూపు సంతరించుకుంది. ఈ జంక్షన్‌లో విదేశీ జాతి పూల మొక్కలను ప్రత్యేకంగా తెప్పించి నాటారు. ఈనెల 17న సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఈ మొక్కలు నాటే కార్యక్రమానికి మంత్రి హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాగా ఈ జంక్షన్ నుంచి రిమ్మనగూడ నుంచి సిద్దిపేట మార్గంవైపు వ్యాపార, వాణజ్య రంగాల అభివృద్ధికి బాటలు పడ్డాయి. రాబోవు రోజుల్లో రిమ్మనగూడ నుంచి బూర్గుపల్లి గ్రామం మీదుగా మల్లన్నసాగర్‌కు నాలుగులేన్ల రోడ్డు ప్రతిపాదన ఉండటం, అది పూర్తయితే మల్లన్నసాగర్‌కు ఇది ప్రధాన రోడ్డుగా మారి పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశమేర్పడి,. అభివృద్ధి వేగిరమయ్యే అవకాశం కలిగింది.


గజ్వేల్ రింగు రోడ్డుపై జాతీయ హంగులద్దుకున్న రిమ్మనగూడ జంక్షన్ ఇదే

కొసరు పనుల్లో రైల్వేశాఖ నిర్లక్ష్యం

గజ్వేల్ రింగు రోడ్డుపై జాలిగామ–ధర్మారెడ్డిపల్లి గ్రామాల మధ్య గజ్వేల్ రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే బ్రిడ్జి పెండింగ్‌లో ఉండటం శాపంగా మారింది. ఈ బ్రిడ్జి పూర్తికాక, ఇక్కడ 1.5 కిలోమీటర్ల మేర రింగు రోడ్డు పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇక్కడ రైల్వే ట్రాక్ ఉండటం వల్ల ఈ ట్రాక్‌పై నుంచి బ్రిడ్జి నిర్మించి దాని మీదుగా వాహనాలు వెళ్లేలా పనులు చేపట్టారు కానీ పూర్తి చేయకుండానే అర్ధంతరంగా వదిలేశారు. బ్రిడ్జి పూర్తయితే తప్ప ఈ రోడ్డు అనుసంధానమయ్యే అవకాశం లేదు. ఈ పనులను దక్షిణ మధ్య రైల్వే శాఖ పూర్తి చేయాల్సి ఉండగా, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల రింగు రోడ్డు అందుబాటులోకి రావడానికి బ్రేకులు పడతాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఛత్రపతి శివాజీ జీవితం ఆదర్శప్రాయం

నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి


కమలాపురంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): ఛత్రపతి శివాజీ జీవితం ఆదర్శ ప్రాయమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం శివాజీ జయంతి పురస్కరించుకొని పెద్దశంకరంపేట మండల పరిధిలోని కమలాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఇక మండలం పరిధిలోని కొలపల్లి, లక్ష్మాపూర్, బూరుగుపల్లి, ఉత్తులూర్, రామోజీ పల్లి, కమలాపూర్, ఆరేపల్లి, పెద్దశంకరంపేట తో పాటు ఆయా గ్రామాల్లో యువకులు ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో పేట ఎంపీపీ జంగం శ్రీనివాస్, పేట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మురళీ పంతులలు, వైస్ ఎంపీపీ లక్ష్మీ రమేశ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కుంట్ల రాములు, ఎంపీటీసీలు వీణ సుభాష్ గౌడ్, స్వప్న రాజేశ్వర్, దత్తు, నాయకులు రాములు, రాజు, లింగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

యువతపైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉంది

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరుటౌన్: దేశ భవిష్యత్ యువతపై ఆధారపడి ఉందని బీఆర్ఎస్ రాష్ట నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు మండలం రుద్రారం చెందిన పలువురు యువకులు ఎన్ఎంఆర్ యువసేనలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత రేపటి రాజకీయ భావి భారత నిర్దేశకులన్నారు. ఎన్ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై సేవ చేయాలన్న లక్ష్యంతో యువకులు ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. యువత తలుచుకుంటే సమాజంలో ఎటువంటి మార్పులైన తేవచ్చన్నారు. మెరుగైన సమాజం కోసం యువత కృషి చేయాలని కోరారు. యువసేన సభ్యులకు తన అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. పదవులు ముఖ్యం కాదని మనం చేసే మంచి పనులే చిరస్థాయిగా నిలుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో వీరయ్య, అశోక్, సూరయ్య, యాదయ్య, వంశీకృష్ణ, లక్ష్మీ ప్రసాద్, హరికృష్ణ, గణేష్, మల్లేష్, మధు, జనార్ధన్, విజయ్, రాము, లక్ష్మణ్, మురళి, సంపత్, శివ రాజ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



నీలం మధు సమక్షంలో ఎన్ఎంఆర్ యువసేనలో చేరిన యువకులు

కనుల పండువగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం


జహీరాబాద్ టౌన్: శివపార్వతుల కల్యాణంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు


సదాశివపేట(సంగారెడ్డి): చిన్నారులతో ఎమ్మెల్యే జగ్గారెడ్డి


మనూరు(నారాయణఖేడ్): రథంపై ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

సదాశివపేట (సంగారెడ్డి): శ్రీ సంగమేశ్వర మందిరంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం శనివారం రాత్రి 12 గంటలకు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కౌన్సిలర్ ఆకుల శివకుమార్ మంజుల దంపతులు, బుగ్గారపు శ్రీనివాస్ గుప్తా, శ్రీమతి రాజేశ్వరి దంపతులు కల్యాణం నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జగ్గారెడ్డి: శ్రీ సంగమేశ్వర మందిరంలో మహాశివరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్ రెడ్డి సంగమేరున్ని దర్శించుకున్నారు. నాట్యశిల్ప అకాడమీ భాగ్యరేఖ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యాలను తిలకించారు.

జహీరాబాద్ టౌన్: శ్రీరుక్మిణి పాండురంగ సహిత కోటిలింగ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శివపార్వతుల కల్యాణాన్ని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బెజుగం రాజగోపాల్, ప్రధాన కార్యదర్శి నామరవి కిరణ్ గుప్త, బీఆర్ఎస్ నాయకులు మంకాల్ సుభాష్, గుండప్ప, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వర ఆలయంలో:

అల్గోల్ రోడ్డులోని శ్రీసిద్ధేశ్వర ఆలయంలో పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారి పల్లకిసేవ నిర్వహించారు.

పటాన్‌చెరు టౌన్: మూడో రోజు అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ గుట్టపై శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి కల్యాణం కమనీయంగా సాగింది. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చి నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే సతిమణి యాదమ్మ, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి, ఆలయ చైర్మన్ తులసీ రెడ్డిలు స్వామి వారికి పట్టువస్త్రాలు, పుస్తె మెట్టలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ శశిధర్, జూనియర్ అసిస్టెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

కోహీర్(జహీరాబాద్): కవేలి గుట్టపై వెలిసిన శ్రీ గిరిజాసంగమేశ్వర స్వామి కల్యాణాన్ని ఆదివారం మధ్యాహ్నం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాలతో కల్యాణ తంతును సాంప్రదాయబద్ధంగా జరిపించారు.

నారాయణఖేడ్: ఖేడ్ కాశీనాథ్ ఆలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించగా ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సతీమణి జయశ్రీరెడ్డి పాల్గొన్నారు. తుర్కాపల్లి సంగమేశ్వర ఆలయంలో అభిషేకం, ఉమాసంగమేశ్వర కల్యాణం, మహాప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు.

మనూరు(నారాయణఖేడ్): మాయికోడ్‌నుంచి పార్వతి పరమేశ్వరులను చైతన్య రథంపై ఊరేగింపుగా ఆదివారం ఉదయం తీసుకెళ్లారు. ప్రతి ఏడాది పంచలింగేశ్వర ఆలయానికి పార్వతి పరమేశ్వరులను ఊరేగింపు తీసుకెళ్లడం ఆనవాయితీ.

మునిపల్లి(అందోల్): పార్వతి పరమేశ్వరుల కల్యాణం ఆలయ ధర్మకర్త నగేశ్వరి రామమూర్తి దంపతులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం మండలంలోని బుదేరా గుట్టపై శ్రీ భ్రమరాంభ మల్లికార్జునస్వామి దేవాలయంలో పూజారి అయ్యప్పస్వామితో జరిపించారు.

హత్నూర(సంగారెడ్డి): రెండో రోజు శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.


శివపార్వతుల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


సాయిభరత్ గౌడ్ (ఫైల్)

మెదక్ రూరల్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా హవేళిఘణాపూర్ మండలం పోచారం ప్రాజెక్టు వద్ద ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హవేళిఘణాపూర్‌కు చెందిన సాయి భరత్ గౌడ్ (24) చౌట్లపల్లి కల్లు దుకాణంలో పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. శనివారం సాయంత్రం సోదరుడు సంతోశ్‌కు ఫోన్ చేసి పోచారం ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. దీంతో ఆందోళన చెందిన సంతోశ్ తన స్నేహితులతో కలిసి అక్కడకు వెళ్లి చూడగా సాయిభరత్ చెప్పులు, బట్టలు ప్రాజెక్టు వద్ద కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అక్కడికి చేరుకున్న పోలీసులు గజఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

కూలిన నాచారం దేవస్థానం ముఖద్వారం


చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

- ఐదుగురికి తీవ్రగాయాలు
- ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం
- మున్సిపల్ పరిధిలోని పోతరాజుపల్లి వద్ద ఘటన
- నిర్మాణంపై పలు అనుమానాలు


కూలిన కమాన్ వద్ద గుమిగూడిన జనం

తూప్రాన్: నాచారం దేవస్థానం ముఖద్వారం(కమాన్) నిర్మాణ పనులు జరుగుతున్నారు. ప్రమాదవశాత్తు కమాన్ కూలిన ఘటనలో ఐదుగురు భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ పరిధి పోతరాజుపల్లి వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పోతరాజుపల్లి వద్ద సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం లక్ష్మీ నర్సింహస్వామి దేవాస్థాన కమాన్ ఐదు దశాబ్దాల క్రితం దాతలు నిర్మించారు. వాహనలు కమాన్‌ను ఢీకొనడంతో శిధిలావస్థకు చేరుకొని ప్రమాదకరంగా మారింది. దీంతో ఆలయ పాలక మండలి సభ్యుల తీర్మానం మేరకు ముఖద్వారం(కమాన్)ను కూల్చివేశారు. తిరిగి నూతన కమాన్ నిర్మాణం చేపట్టారు. అయితే గతంలో నిర్మించిన దాతలే ముందుకు రావడంతో ఇటీవల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆదివారం స్లాబ్ పనులు జరుగుతున్నాయి. ఆ సమయంలో ఒక్కసారిగా స్లాబ్ కూలింది. అక్కడ పని చేస్తున్న భిక్షపతి, బాబు, శంకర్, గణేశ్, సురేశ్ తీవ్రంగా గాయపడ్డారు. వెంకటే అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇందులో ఇద్దరి పరిస్థితి ఆందోళనకగా ఉండటం మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాగా ముఖద్వారం నిర్మాణ పనులు నాసిరకంగా చేపడుతున్న కారణంగానే కూలినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్ని దశాబ్దాల పాటు మన్నికగా ఉండాల్సిన ముఖద్వారం నిర్మాణంలో సంబంధిత అధికారులు స్పందించి నాణ్యత ప్రమాణాలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బీజేపీతోనే ప్రజాసంక్షేమ పాలన సాధ్యం


కారముంగిలో మాట్లాడుతున్న జనవాడే సంగప్ప


చిన్నశంకరపేట (మెదక్) మిర్జాపల్లిలో మాట్లాడుతున్న తాళ్లపల్లి రాజశేఖర్

చిన్నశంకరంపేట(మెదక్): ప్రజాసంక్షేమ పాలన బీజేపీతోనే సాధ్యమని బీజేపీ సీనియర్ నాయకులు తాళ్లపల్లి రాజశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని మిర్జాపల్లి గ్రామంలో నిర్వహించిన కర్నార్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం వందల సంఖ్యలో సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే తెలంగాణ సర్కార్ వాటిని తిరస్కరిస్తూ పేద ప్రజలకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందకుండా చేస్తుందన్నారు. పేద ప్రజలకు ఉపయోగపడే అయుష్మాన్ భారత్ పథకంతో పాటు అనేక పథకాలు అమలు చేయడంతో తెలంగాణ ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు పేదలకు అందనున్నాయన్నారు. ప్రజాసమస్యలను వినడంతో పాటు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయేందుకే బీజేపీ కర్నార్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పట్లోరి పోగులరాజు, బీజేపీ మండల నాయకులు సందిగారి పెంటాగౌడ్, రాజుగౌడ్, సిద్దిరాములు, బీజేపీ జిల్లా నాయకులు సురేష్‌గౌడ్, బీజేపీ మండల నరేందర్‌రెడ్డి, దశరథం, గనేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టుల పేరుతో..

మనూరు(నారాయణఖేడ్): బీజేపీ ఆధ్వర్యంలో కార్నర్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం నాగల్‌గిద్ద మండల పరిధి కారముంగిలో కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట అధికార ప్రతినిధి జనవాడ సంగప్ప మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటు నుంచి టీఆర్ఎస్ నాయకులు సాగునీటి పేరిట వేల కోట్ల పోగుచేసుకున్నారని అన్నారు. సంగమేశ్వర, బసవేశ్వపై మాట్లాడుతున్న మంత్రి గతంలో చేపట్టిన ఎత్తిపోతల పథకాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయారన్నారు. కేంద్రం అందిస్తున్న ఆయుష్మాన్ భారత్, ఫసల్ బీమా, సాయిల్ టెస్ట్‌లాంటి పథకాలను పక్కరాష్ట్రాలు అమలు చేస్తున్నా తెలంగాణలో అమలు చేయడంలేదని ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజలను మభ్య పెట్టడానికే బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పథకాలు అంటున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు రజినికాంత్, గడ్డెకాశీనాథ్, దిగంబర్ పాటిల్, అనిల్, చరణ్‌సింగ్, మహాదేవ్, బీమన్న, మారుతి అమ్రేశ్, సగునాయక్, రాజుగౌడ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం


కాలిపోయిన బీరువాను చూపుతున్న బాధితురాలు

రాయికోడ్(అందోల్): ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధమైంది. ఈ సంఘటన శనివారం రాత్రి జరిగింది. ఆదివారం బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కర్చల్ గ్రామానికి చెందిన ఈడ్గి నిర్మలమ్మ, ఆమె కూతురు రేకుల షెడ్డు ఇంటిలో నిద్రించారు. నిర్మలమ్మకు చెందిన మరో పెంకుటిల్లులో అర్ధరాత్రి ప్రమాదశత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలురేగాయి. గమనించిన స్థానికులు బాధితురాలికి సమాచారం అందించారు. మంటలార్పే ప్రయ త్నం చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. అప్పటికే ఇంటిలోని నిత్యావసరాలు, బట్టలు, బంగారు గుండ్ల గొలుసు, రూ.2 లక్షల నగదుకు కాలిపోయాయి. ఇల్లు కాలిపోవడంతో కట్టుబట్టలతో మిగిలారు. అధికారులు విచారణ చరిపి తన కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితురాలు కోరింది. కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు ప్రభాకర్ సంఘటన స్థలాన్ని సందర్శించి రూ.5 వేల నగదును అందజేశారు.